క్లుప్తంగా

నేడు రెడ్డి జనసేవా సంఘ కార్తీక వనసమారాధన

చీరాల: రెడ్డి జనసేవా సంఘం చీరాల ఆధ్వర్యంలో 25వ కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం చీరాల మండలం వాడరేవులోని బ్రహ్మాస్ గెస్ట్ హౌస్‌లో నిర్వహిస్తున్నట్లు రెడ్డి జనసేవా సంఘ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సీ నారాయణస్వామిచే ఆధ్యాత్మిక ప్రవచనం, ముఖ్య అతిథుల ఉపన్యాస కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రముఖ యాంకర్ ఆరె శ్యామలరెడ్డి హాజరవుతారన్నారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, లింగ రామకృష్ణారెడ్డి, కంజుల వీరారెడ్డి, కంది సంజీవరెడ్డి, తెనాలి గోవర్ధనరెడ్డి తదితరులు హాజరవుతారని, రెడ్డి జనసేవా సంఘీయులందరూ కార్యక్రమానికి హాజరుకావాలని వారు ప్రకటనలో పేర్కొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి


స్వర్ణలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ హస్మప్రియ

స్వర్ణ (కారంచేడు): గర్భిణులు ప్రసవ సమయం వరకు వారిని పర్యవేక్షిస్తున్న వైద్య సిబ్బందితో పాటు, గర్భిణులు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ షాలినీ, డాక్టర్ హస్మప్రియలు అన్నారు. శనివారం వారు మండలంలోని స్వర్ణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) ద్వారా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని సుమారు 42 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మూడో నెల వచ్చిన వెంటనే మీ సమీప ఆశ, ఏఎన్ఎంల వద్ద మీ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అప్పుడు వారు మీ ఆరోగ్య వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేసి క్రమం తప్పకుండా మీకు అందించాల్సిన వైద్య సేవలను వారు గుర్తు చేస్తుంటారని చెప్పారు. క్రమం తప్పకుండా వేయించాల్సిన టీడీలు, హిమోగ్లోబిన్ శాతంను కూడా గుర్తించి అవరమైన మాత్రలు, ఆరోగ్య సూచనలు అందిస్తారన్నారు. కనీసం నెలకు ఒకసారి వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వీ నాగేశ్వరావు, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసిఫోరా, ఏఎన్ఎంలు, ఆశాలు, స్వర్ణ, కొడవలివారిపాలెం, జరుబులవారిపాలెం, కేశవరప్పాడు, స్వర్ణపాలెం, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాలకు చెందిన గర్భిణులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీల్లో ముగిసిన భద్రతా వారోత్సవాలు

బల్లికురవ: గ్రానైట్ క్వారీలో ప్రమాదాలు సంభవించకుండా ప్రతి సంవత్సరం చేపట్టే భద్రతా వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ క్వారీలో భద్రతా వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బాపట్ల పల్నాడు, ప్రకాశం జిల్లాల మైన్స్ టీమ్ సభ్యులు రోజుకు నాలుగు క్వారీల్లో భద్రతా నిబంధనలపై కార్మికులకు అవగాహన కల్పించారు. శనివారం అమూల్య శ్రీకాంత్, విట్టర్ శ్రీనివాస గ్రానైట్ క్వారీలను టీమ్ పరిశీలించారు. టీమ్ సభ్యులు సురేష్ బాబు సత్యసుందర్, బ్రహ్మారెడ్డి శివనారాయణ, నాగావళి, పాల్గొన్నారు. భద్రతా చర్యలు పూర్తి స్థాయిలో పాటించిన క్వారీ నిర్వాహకులకు త్వరలో ఒంగోలులో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందిస్తామని చెప్పారు.

రాయితీ లేదు.. విత్తనం లేదు


పప్పు శనగ విత్తనాలు


విత్తడానికి సిద్ధం చేస్తున్న ట్రాక్టర్

- పప్పు శనగ విత్తనాల కొనుగోలుకు రైతుల అగచాట్లు
- క్వింటా ధర రూ.7 వేలకు పైమాటే
- బహిరంగ మార్కెట్ కంటే రాయితీ విత్తన ధర అధికం
- నియోజకవర్గంలో 30 వేల ఎకరాలకు పైనే పప్పు శనగ సాగు

అద్దంకి: కూటమి ప్రభుత్వం రాగానే అతివృష్టి, అనావృష్టి సంభవించి రైతన్నలు నష్టపోయారు. పట్టెడన్నం పెట్టె రైతన్నల సంక్షేమానికి ఎంత చేసిన తక్కువే. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతుబాంధవుడిగా పేరు తెచ్చుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం రాగానే రైతన్నల కష్టాలు మొదలయ్యాయి. అటు ఖరీఫ్ పూర్తిగా నష్టపోగా రబీ సీజన్ సైతం తుఫాన్లతో తుడిచి పెట్టుకుపోయింది. కనీసం రబీ చివరి సీజన్‌లో అయినా శనగ పంటకు సాయం చేద్దామన్న ఆలోచన ఏమాత్రం లేకపోయింది. రాయితీపై వివిధ రకాల విత్తనాలు పంపిణీ చేయడంలో వ్యవసాయ శాఖ విఫమైంది. కేవలం పచ్చిరొట్ట విత్తనాలు ఇచ్చి చేతులు దులువుకుంది. దాంతో రైతుకు రాయితీపై విత్తనాల పంపిణీ నేతి బీరకాయలో నేతి అన్న చందంగా మారింది. మాది రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం సైతం రైతును పట్టించుకోడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పేరుకే రాయితీ..

ప్రస్తుతం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పప్పు శనగ సాగుకు రైతు సమాయత్తం అవుతున్నాడు. దాని కోసం వ్యవసాయ శాఖ రాయితీపై పప్పు శనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. దానికిగాను విత్తనాలు కోసం రైతులు రిజిస్టర్ చేసుకోవాలని కోరింది. అయితే బయట రేటుకు వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ చేసే శనగల ధర కంటే అధికంగా ఉండటంతో రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. అత్యధికంగా రైతులు సాగు చేసే జేజీ-11 రకం శనగ విత్తనాలు బయట మార్కెట్‌లో రూ.6,500లకు రైతులకు లభిస్తున్నాయి. అయితే వ్యవసాయ శాఖ పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన జేజీ 11 రకం శనగలు కింటా ధర రూ.9,400 ఉంది. ఇందులో 25 శాతం రాయితీ పోను క్వాంటా రూ.7,050 ధర అవుతుంది. రాయితీ తీసివేసినా బయట మార్కెట్‌లో క్వాంటాలు ధర అధికంగా ఉండటంతో రైతులు ఆవిత్తనాల కొనుగోలుకు ఆసక్తి చూపలేదు.

రాయితీ విత్తనాలు.. మంచి విత్తనాలేనా ?

వ్యవసాయ శాఖ ప్రకటించిన ధరకు శనగ విత్తనాలు కొనుగోలు చేద్దామన్నా వారు కోల్డ్ స్టోరేజ్‌ల నుంచే తెచ్చి విక్రయిస్తున్నట్లు తమకు తెలుస్తోందని, నాణ్యమైన విత్తనాలు కావని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దాంతో అత్యధిక మంది రైతులు విత్తనాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి కలుగుతోందని ఆవేదన చెందుతున్నారు.

విత్తన కిట్లకు తిలోదకాలు..

గతంలో కొత్తరకం విత్తనాలను తమ పొలంలోనే పండించి ఇతర రైతులకు ఇవ్వడం కోసం వ్యవసాయ శాఖ ఉచిత కిట్లను పంపిణీ చేసేది. ఈ సంవత్సరం దానికి తిలోదకాలు పలికింది. దానికి రాయితీ కిట్లు పేరు పెట్టి అత్యధిక ధర పెట్టడంతో వ్యవసాయాధికారులు తెప్పించడం మానుకున్నారు.

రైతుకు చేస్తున్న మేలు ఏమీ లేదు..



ప్రభుత్వం 25 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు రైతుకు పంపిణీ చేస్తుంది. ప్రభుత్వం జేజీ- 11 రకం పూర్తి ధర రూ.9400 కాగా 25 శాతం సబ్సిడీ పోను రైతుకు రూ.7050 అందిస్తుంది. కేఏకె-2 రకం పూర్తి ధర రూ. 12100 కాగా రాయితీ పోను రూ. 9075 రైతుకు చెల్లిస్తున్నారు. కాని బయట మార్కెట్‌లో శనగ విత్తనాలు రూ. 7000 ధర పలుకుతుంది. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ విత్తనాలే ఎక్కువ ధర పలుకుతున్నాయి.

– సుబ్బారెడ్డి, రైతు, కొండమూరు

నాణ్యమైన విత్తనాలు దొరకడం లేదు..



పప్పు శనగ సాగుకు ఇప్పుడే అనుకూలం. పప్పు శనగ సాగుకు ఇక్కడ భూములు అనుకూలం. నల్ల రేగడి భూములు కావడంతో పదునుతో భూమిలో విత్తనాలు ఎద పెడితేమంచి దిగుబడులే వస్తున్నాయి. ఈ ఏడాది రబీలో రెండు ఎకరాల్లో సాగు చేయదలుచుకున్నాను. కాని నాణ్యమైన విత్తనాలు దొరకడం లేదు.

– చెరుకూరు సుబ్బారావు, రైతు, కే రాజుపాలెం

సీడ్ ప్రాసెస్ వల్ల ధర అధికం..

శనగ విత్తనాలు ఏపీ సీడ్స్ సంస్థ సేకరిస్తుంది. వారు సేకరించిన తరువాత విత్తనశుద్ధి చేసి బ్యాగ్‌ల్లో నింపి ట్యాగ్‌తో పంపిణీ చేస్తారు. దాని వలన బయట మార్కెట్ కంటే పంపిణీ సీడ్స్ ధర అధికంగా ఉంటుంది. ఏదైనా ఏపీ సీడ్స్, ప్రభుత్వం నిర్ణయం ప్రకారమే ప్రాసెస్ ఉంటుంది.

– ధన్‌రాజ్, ఏడీఏ

ఎట్టకేలకు చెత్తను తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కారంచేడు: పారిశుద్ధ్య విషయంలో ఎట్టకేలకు అధికారులు నిర్లక్ష్యం వీడారు. వాడరేవు-పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో కారంచేడు వెంకటేశ్వస్వామివారి ఆలయం సమీపంలో పేరుకుపోయిన చెత్తా, చెదారాన్ని తొలగించాలని 'దేవాలయమా.. డంపింగ్ యార్డా' అని సాక్షి దినపత్రికలో కథనం వెలువడింది. దీంతో అధికారులు స్పందించారు. దేవాలయానికి అతి సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వేసిన చెత్తా, చెదారం అక్కడ కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లడంతో పాటు, అక్కడ కుక్కలు, పందులు చేరి నానా హడావుడి చేస్తున్నాయి. పంచాయతీ సిబ్బంది స్పందించి శనివారం ఉదయం పొక్లెయిన్‌తో పూర్తిగా తొలగించారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులతో పాటు, ఆ రహదారిలో ప్రయాణించే ప్రయాణికులు సైతం సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.


చెత్తను తొలగిస్తున్న పొక్లెయిన్

చట్టాలపై అవగాహనతో న్యాయం


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సుధ


అద్దంకి సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి

చీరాల రూరల్: చట్టాలపై అవగాహన కలిగి ఉంటే సులభంగా న్యాయ సహాయం అందుకోవచ్చని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ వైఏ మహిళా డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా న్యాయమూర్తి సుధ పాల్గొని మాట్లాడారు. ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు న్యాయమూర్తి చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం అందాలనేదే న్యాయ సేవా దినోత్సవ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లీలాకుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రమేష్‌బాబు, ఎస్సై కె. కమలాకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

అద్దంకిలో..

అద్దంకి రూరల్: ఉచిత న్యాయసాయాన్ని అర్హులైన వారు వినియోగించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి డీ. నాగ వెంకటలక్ష్మీ అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాది ఎర్రమోతు రమేష్ బాబు, న్యాయవాదులు పీఎల్ఎస్ ప్రసాద్, టి. మార్త శ్రీనివాస్, ఎం. ప్రకాష్, షేక్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు


దేవాంగపురిలో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖరనాయుడు


వేటపాలెం: పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్ పార్వతి


ఆదిపూడిలో ఓటరు జాబితా పరిశీలిస్తున్న తహశీల్దార్ అనిత

చీరాల టౌన్/వేటపాలెం: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని చీరాల ఆర్డీవో పి.చంద్రశేఖరనాయుడు సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్వోలు, వీఆర్వోలు అర్హులైన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. మండలంలోని దేవాంగపురి, రామకృష్ణాపురం, సాల్మన్‌సెంటర్ గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చీరాల ఆర్డీవో పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి పౌరుడు విధిగా ఓటు హక్కు పొంది ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నూతనంగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్కరు విధిగా పుట్టినతేదీ, ఆధార్, పాస్‌పోర్టు ఫొటోలు అందించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- వేటపాలెం మండలం పరిదిలోని పందిళ్లపల్లి, రామన్నపేట పంచాయతీ పరిదిలోని పోలింగ్ బూత్‌లను తహశీల్దార్ పార్వతి పరిశీలించారు. పోలింగ్ బూతుల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయా లేదా పరిశీలించారు.

తప్పులు దొర్లకుండా సరిదిద్దాలి..

చినగంజాం/కారంచేడు: ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా బూత్ స్థాయి అధికారులు సరిదిద్ది కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వర్తించాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకర్ రావు సూచించారు. చినగంజాం మండలం పరిధిలోని కడవకుదురు, చినగంజాం, రాజబంగారుపాలెం, మున్నంవారి పాలెంలలో స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని పేర్లు గ్రామస్తులకు చదివి వినిపించాలని, జాబితాలో ఒకే కుటుంబం ఓట్లు అన్నీ ఒక పోలింగ్ కేంద్రంలో ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

- పర్చూరు తహశీల్దార్ బ్రహ్మయ్య ఓటర్లకు సంబంధించిన స్పెషల్ క్యాంపెయిన్ డేని నిర్వహించారు. దీనిలో భాగంగా పర్చూరు మండలంలోని 141, 142, 143, 144, 145, 146 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వీఎల్వోలు, ఎమ్మార్పై ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.
- ఓటర్ క్యాంపును అర్హులైన వారు వినియోగించుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు అనిత అన్నారు. ఆమె మండలంలోని కారంచేడు, ఆదిపూడి గ్రామాల్లో ఓటరు క్యాంపులను ఆమె పరిశీలించారు. విధి నర్వహణలో బీఎల్‌ఓలు నిర్లక్ష్యంగా ఉంటే వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు


కారంచేడులో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ వెంకట్రావు


వేమవరంలో కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎస్సై

కారంచేడు: పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్‌గా ఉన్న ప్రతి ఒక్కరూ మీ వ్యక్తిగత ప్రవర్తనను మార్చుకొని నేరాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వీ వెంకట్రావు అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు పోలీస్ స్టేషన్‌లో మండల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మీ నేర ప్రవృత్తిని బట్టి మీపై ఉన్న రౌడీ షీట్ తొలగిస్తామన్నారు. అలా కాకుండా మీ ఆలోచనల్లో తేడా లేకుండా నేరాలపై మీ దృష్టి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని, బెయిల్ రద్దుకు సిఫార్సు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతతో జీవించాలి..

బల్లికురవ: గ్రామాలోని ప్రజలు ఒకరికొకరు ఐక్యతతో జీవించాలని ఎస్సైవీ చౌదరి కోరారు. ఫ్యాక్షన్ గ్రామమైన మండలంలోని వేమవరం, గిరిజన తండాలో శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి పల్లె నిద్ర చేపట్టారు. ఈ సందర్భంలో ఎస్సై మాట్లాడుతూ కక్ష్యలు, కార్పణ్యాలతో పోలీస్‌స్టేషన్, కేసులు, కోర్టులకు వెళ్లటం వల్ల ఎంతో విలువైన సమయం డబ్బు వృథా అవుతుందని, అల్లర్లకు పాల్పడవద్దని కాలనీ వాసులను సూచించారు. ఒకసారి అల్లర్లకు పాల్పడితే రౌడీ షీట్ తెరుస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలు అవసరం


మంజులాదేవిని సత్కరిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

చీరాల రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని సాధించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ గేరపాటి మంజులాదేవి ఇటీవల డాక్టరేట్ పొందిన సందర్భంగా కళాశాల ఆధ్వర్యంలో ఆమెకు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్, ప్రేమ హార్ట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఇస్తర్ల బాబురావులు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థిని, విద్యార్థులు డాక్టర్ మంజులాదేవిని ఆదర్శంగా తీసుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పరాజు, ఇస్తర్ల సుభాషిణి, విద్యాసాగర్, పుష్పరాజు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కట్టారు.. గాలికొదిలేశారు !


పదేళ్లుగా నిలిచిపోయిన కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు


చప్టాకు ఆనుకుని ఉధృతంగా ప్రవహిస్తున్న రొంపేరు కాలువ

- పదేళ్లయినా ప్రారంభోత్సవానికి నోచుకోని బ్రిడ్జి

చీరాల రూరల్: పాదాచారులకు, వాహనదారుల రాకపోకలకు అనుకూలంగా ఉండేందుకు పదేళ్ల క్రితం చీరాల పట్టణ శివారు ప్రాంతంలోని రొంపేరు మురుగు కాలువపై నిర్మించిన బ్రిడ్జి ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఆ బ్రిడ్జి మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయింది. బ్రిడ్జి నిర్మాణం 90 శాతం పనులు పూర్తికాగా కేవలం 10 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. బ్రిడ్జి నిర్మాణాన్ని గాలికొదిలేయడంతో పాత చప్టాపై ప్రజలు, వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఇటీవల సంభవించిన తుపానులు, వరదలు కారణంగా రొంపేరు మురుగు కాలువ ముమ్మరంగా ప్రవహించింది. దానికితోడు ప్రతిరోజు వర్షాలు పడుతుండం కాలువకు ఆనుకుని ప్రవాహం సాగుతుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు, పశువుల కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వివరాల్లోకి వెళ్తే..

కాలువలు ఆధునికీకరణలో భాగంగా 2014-15 కాలంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పాదాచారులు, వాహనదారుల సౌకర్యార్థం కృష్ణా, గోదావరి కెనాళ్ల, కొమ్మమూరు, మురుగు కాలువలపై బ్రిడ్జిల నిర్మాణాలను ప్రతిపాదించి పనులు చేపట్టింది. అందులో భాగంగా చీరాల పట్టణ శివారు ప్రాంతం పొలాలకు స్వర్ణ గ్రామానికి వెళ్లే మార్గంలోని రొంపేరు మురుగు కాలువపై రూ. 1.8 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టింది. ఆ బ్రిడ్జి నిర్మాణాన్ని జీవీఆర్ అనే సంస్థ చేజిక్కించుకుని పనులు ప్రారంభించింది. పనులు చేపట్టిన నాటి నుంచి ఏడాది కాలంలో అంటే 2016 నాటికే 90 శాతం పనులు పూర్తి చేసింది. అంటే ఇంకా కేవలం 10 శాతం మాత్రమే పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇక్కడ నుండే పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు పర్యవేక్షణ కూడా పూర్తిగా కొరవడింది.


కుంగిపోయి అధ్వానంగా ఉన్న పాత చప్టా

బిల్లులు చెల్లింపులు కాలేదని..

అప్పటికే బ్రిడ్జి నిర్మాణ పనులు చివరి దశకు చేర్చిన సంభందిత కాంట్రాక్టరుకు అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని సమాచారం. ఎంతో ఖర్చు చేసి నిర్మాణాన్ని చివరి దశకు చేర్చినా నిధులు ఇవ్వకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో సంబంధిత కాంట్రాక్టరు పనులు వదిలేసి పలాయనం చిత్తగించారని సమాచారం. బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా పైన రైలింగ్ కోసం వదిలిన ఇనుప చువ్వలు కొన్ని తుప్పుపట్టిపోగా మరి కొన్ని చువ్వలను దొంగలు అపహరించుకెళ్లారు. బ్రిడ్జి నిర్మాణం మాత్రం మురుగు నీళ్లపై కళావిహీనంగా దర్శనమిస్తోంది.

ఆధునికీకరణ పనులు నిలుపుదల చేశారు..

ప్రభుత్వం నుంచి పనులు ప్రారంభించాలని మళ్లీ జీవో ఇస్తే పనులు ప్రారంభిస్తాం. మిగిలిన పదిశాతం పనులకు కొత్త ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. అది కూడా కొన్ని నిధులు మాత్రమే అవసరమవుతాయి.

– మురళీ కృష్ణ, ఇరిగేషన్ శాఖ ఈఈ, చీరాల

వైభవంగా కోటి సోమవార వేడుకలు

బల్లికురవ: శివకేశవులకు ప్రీతిపాత్రమైన కార్తీక మాసం కోటి సోమవారం సందర్భంగా శనివారం శివాలయాలు, విష్ణు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం 5 గంటల నుంచి కొనిదెన, చెన్నుపల్లి, కొండాయపాలెం అంబడిపూడి, గ్రామాల్లో స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వివాహిత అదృశ్యంపై కేసు

అద్దంకి రూరల్: 12 రోజుల క్రితం పనికి వెళ్లిన వివాహిత కనిపించకపోవటంతో తల్లి ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఖాదర్‌బాషా వివరాల మేరకు.. మండలంలోని విప్పర్లవారిపాలేనికి చెందిన దాసి రామారావు, పెద్ద అమ్మోరు దంపతుల కుమార్తె అరుణ కుమారికి కొరిశపాడు మండలం నిడమానూరు గ్రామానికి చెందిన అబోతు వెంకటేశ్వర్లుతో వివాహం చేశారు. కాగా రెండు నెలల క్రితం నుంచి ఇద్దరు మనస్పర్థలతో వేర్వేరుగా ఉంటున్నారు. అరుణ కుమారి తన పుట్టింటిలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటోంది. ఈనేపథ్యంలో గతనెల 29వ తేదీన కొరిశపాడులో పొగాకు మొక్కలు నాటే పనికి వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి రాకపోవటంతో తల్లి బంధువుల ఇళ్లల్లో, స్నేహితులు వద్ద వాకబు చేసినా సమాచారం అందలేదన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు.. శనివారం స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో ఎస్సై కేసు నమోదు చేశారు.

యువత ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి


దేవుని గీతం ఆలపిస్తున్న యువతి

చీరాల రూరల్: యువతీ, యువకులు చెడు ప్రవర్తన విడనాడి సన్మార్గంలో నడవాలని రెవరెండ్ పిల్లి దేవదాసు అన్నారు. స్థానిక చర్చి కాంపౌండ్‌లోని సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి యూత్ ఆధ్వర్యంలో శనివారం 53వ కమ్యూనిటీ క్రిస్మస్ పోటీలు ప్రారంభించారు. ముందుగా దేవదాసు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేవుని వాక్య సందేశం అందించారు. లూథరన్ చర్చిల నుంచి హాజరైన యువతీ, యువకులకు బైబిల్ గ్రంథంలోని వాక్యాలను, దేవుని పాటలు, నృత్య ప్రదర్శనలు వంటి పోటీలు నిర్వహించారు. కార్యక్రమానంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన యూత్ సభ్యులకు ముఖ్య అతిథుల చేతులు మీదుగా బహుమతులు పంచిపెట్టారు. ఈపోటీల్లో బాపట్ల ఫీల్డ్‌లోని చీరాల, వేటపాలెం, స్వర్ణ, కారంచేడు, పర్చూరు, కుంకలమర్రు, స్వర్ణపాలెం, బేర్‌పేట, శాంతినగర్, కొత్తపేట, ఉజిలిపేట, పాపాయిపాలెం, రోశయ్య కాలనీలతో పాటు బాపట్లలోని అన్ని ప్రాంతాలకు చెందిన యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనంద్, గొర్రెముచ్చు అజయ్, దేట దివాకర్, గొర్రెముచ్చు దేవదాసు, కూరపాటి శ్యామ్, యెరిచర్ల మోహనరావు, యాతం క్రాంతి, ప్రసాద్, పీసీసీ, ఎల్‌సీసీ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.